## నమస్తే తెలంగాణ

# సాగుసాయానికి సంకటం

**రాజకీయ** రాక్షస క్రీడకు రైతన్న బలయ్యాడు. అధికార దాహం అన్నదాతకు ద్రోహం తలపెట్టింది. సాగు సాయానికి సంకటం వచ్చిపడింది. రైతుబంధు కొత్తగా వచ్చిందేమీ కాదు. ఆగమేఘాల మీద ప్రకటించింది కాదు. ఏదో లబ్ధికోసం తెచ్చింది అసలే కాదు. తొలివిడతా కాదు, మలివిడతా కాదు. పన్నెండో విడత పంటసాయం విడుదలకు ఎన్నికల కారణంగా ఇబ్బందులు తలెత్తాయి. ఆరేండ్ల నుంచి ఇస్తున్నదే. ఎప్పటిలాగే ఇచ్చేయొచ్చు. కానీ, ఫిర్యాదులతో లేని వివాదం రాజేయడంతో వెనుకకు పోయింది. నిజానికి నిన్నటిదాకా రైతుబంధు అనేది ఎన్నికల అంశం కానే కాదు. బహుశా సీఎం కేసీఆర్ ప్రభుత్వ విజయ పరంపరలో అదొక అంశంగా ఉండి ఉంటుంది. ఇప్పుడు కాంగ్రెస్ కట్టుకున్న పుణ్యమాని అది చర్చాంశమైంది. సాగుకు అవసరమైన సమస్త సరంజామా సమకూర్చి చివరికి పంట పెట్టుబడిని కూడా అందించడం దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందిన మాట వాస్తవం. ఎవరెన్ని చెప్పినా రైతుబంధును తెచ్చింది, ఇచ్చింది కేసీఆర్ అనేది చరిత్రలో శిలాక్షరం. రేపు ఈ అంశమే పార్టీల మధ్య తేడాలను అంచనా వేసేందుకు గీటురాయి అయినా కావచ్చు. ఇది ఎవరూ కాదనలేని సత్యం.

పదేండ్లపాటు అధికారానికి దూరమై అర్రులు చాస్తున్న కాంగ్రెస్ ఎన్నికల వేళ వెయ్యని ఎత్తులు లేవు, పన్నని కుట్రలు లేవు. సీమాంధ్ర పార్టీలతో అప్రకటిత ఒప్పందాలు మొదలుకొని తెలంగాణ ద్రోహులతో చేతులు కలపడం దాకా దేన్నీ వదిలిపెట్టడం లేదు. బట్టకాల్చి మీదేసే బూటకపు ప్రచారంలో రాటుదేలి పోయింది. బురదజల్లుడు రాజకీయంలో మునిగితేలుతున్నది. తనకు లేని బలం ఉన్నట్టుగా ఊదరగొడుతున్నది. ఇవన్నీ ఎన్నికల వేళ మామూలే అని సరిపెట్టుకున్నా వ్యవసాయం విషయంలో మాత్రం కాంగ్రెస్ తన మనసులోని మాటను బయటపెట్టుకుంటున్నది. మూడు గంటల కరెంటు చాలనే దగ్గర అది మొదలైంది. రైతుబంధు దుబారా అనేదాకా పోయింది. ఇప్పుడిప్పుడే నిమ్మలమైతున్న రైతు బతుకులు ఆగమాగం చేస్తామని కాంగ్రెస్ చెప్పకనే చెప్తున్నది. వ్యవసాయం దండుగన్న గురువు శుశ్రూషలో తరించిన శిష్యపరమాణువు సారథ్యం వహిస్తున్న పార్టీ నుంచి ఇంతకంటే ఎక్కువ ఏం ఆశించగలం?

రైతుబంధు మహా అయితే నాలుగురోజులు ఆలస్యమవుతుంది. కానీ, కాంగ్రెస్‌ను నమ్మి మోసపోతే గోస తప్పదు. అసలుకే ఎసరు రావచ్చు. మాయమాటలు చెప్పి, అధికారం చేజిక్కిన తర్వాత చెయ్యివ్వడం కాంగ్రెస్‌కు షరా మామూలేనని కర్ణాటక పరిణామాలు వందోసారి రుజువు చేస్తున్నాయి. అందుకు భిన్నంగా సీఎం కేసీఆర్ రైతులను కండ్లల్ల పెట్టుకొని కాపాడుకుంటూ వస్తున్నారు. సాగుబడిలో, దిగుబడిలో తెలంగాణను నంబర్‌వన్‌గా నిలబెట్టారు. ఎంత చేసినా ఇంకా చేయాల్సింది ఎంతో ఉన్నదని ఆరాట పడుతున్నారు. మంచోళ్లు ఎవరో, తమను ముంచేది ఎవరో రైతులకు తెలియదా?

### విస్మరణే శ్రద్ధ చూపడమా?



*మణిపూర్ పట్ల ప్రధానికి ప్రత్యేక శ్రద్ధ ఉన్నదని బీజేపీ సీఎం ప్రశంసించారు. 184 మరణాలను, 67 వేల మంది నిరాశ్రయులను విస్మరించి, ఏడు నెలలుగా ఆ రాష్ర్టాన్ని సందర్శించకుండా ఉండటం ద్వారా ప్రధాని ఆ శ్రద్ధ చూపారా? లేక 200 రోజులుగా ఇంటర్నెట్‌పై నిషేధం విధించడం ద్వారానా?*

**- మహువా మొయిత్రా,** తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ

# జాగ్రత్తగా ఆలోచించే సమయమిది



**టంకశాల అశోక్**

**అన్ని పార్టీల ప్రచారపు హోరు ముగుస్తున్నందున ఇక ఓటర్లు వచ్చే 48 గంటల పాటు ప్రశాంతంగా, జాగ్రత్తగా ఆలోచించవలసిన సమయమిది. ఎవరు అధికారంలోకి వచ్చినట్టయితే రాష్ట్రం బాగా అభివృద్ధి చెందుతుంది? తమ జీవితాలు ఇంకా మెరుగుపడతాయి? అన్నవి వారి ముందున్న ప్రశ్నలు.**

**ఇందుకు సమాధానాలను కనుగొనేందుకు తమ ఎదుట గత అనుభవాలు అనేకం ఉన్నాయి. వాటి ఆధారంగా భవిష్యత్తు గురించి ఆలోచించి అంచనాలు వేసుకోగల వివేకం వారికున్నది. అందువల్ల, గత అనేక వారాల ప్రచార కాలంలో అందరి మాటలను విన్న ప్రజలు, రాగల రెండురోజుల పాటు అన్ని విషయాలను నింపాదిగా చర్చించుకొని ఒక నిర్ణయానికి రావాలి.**



తెలంగాణకు 2014 ఒక ముఖ్యమైన మలుపు కాగా, అప్పటినుంచి పదేండ్ల తర్వాత ఈ 2023 ఒక ముఖ్యమైన మైలురాయి కానున్నది. 2014 ఎందువల్ల ముఖ్యమైన మలుపో చెప్పనక్కరలేదు. అది భారతదేశానికి 1947 వంటిది. అంతకుముందటి సుదీర్ఘ కాలమంతా ఇతరుల పాలనలో, పీడనలో మగ్గిపోయిన వెనుకబాటుతనం. 1947 నుంచి భారతదేశం, 2014 నుంచి తెలంగాణ తమ భవిష్యత్తు కోసం అన్వేషణలు మొదలుపెట్టాయి. తమ కోసం తాము కొత్తదారులు వేసుకోసాగాయి. తెలంగాణ విషయానికి వస్తే, కొత్తదారులు వేసుకోవడమంటే అంతకుముందటి వెనుకబాటుతనాన్ని వదిలించుకోవటం. దెబ్బతిని ఉన్న వ్యవసాయరంగాన్ని, రైతులను, కూలీలను, వృత్తిపనుల వారిని, గ్రామాలను, మొత్తంగా గ్రామీణ వ్యవస్థను బాగుపరచుకోవటం. భారతదేశం వంటి వర్ధమాన దేశంలో, తెలంగాణ వంటి వెనుకబడిన సమాజంలో ఆ స్థితి నుంచి విముక్తి కోసం అనేక పోరాటాలు చేసిన ప్రజానీకానికి పునాది, లేదా వెన్నెముక వంటి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బాగుపడటమన్నది అన్నింటికన్న ముందుగా జరగవలసిన పని.

గ్రామాలకు బయట తెలంగాణలోని పట్టణాలు, నగరాలు కుదుటపడాలన్నా, అభివృద్ధి చెందాలన్నా, పట్టణాలలో నివసించే ప్రజలు, గ్రామాల నుంచి అటువెళ్లే ప్రజలు, యువతరం అక్కడ కుదురుకునేందుకు తగిన పరిస్థితులు ఏర్పడాలన్నా, గ్రామాలు నిలదొక్కుకొని ముందడుగు వేయటమే అందుకు పునాది అవుతుంది. మనం 2014 నాటికి వెళ్లిచూసినట్టయితే, తెలంగాణ భవిష్యత్తు నిర్మాణానికి ప్రాతిపదికగా పనిచేసింది ఇటువంటి ఆలోచనలే. తర్వాత పదేండ్ల పాటు మనం అమలులో చూసింది కూడా ఇదే. ఈ ఆలోచనలకు తగిన విధానాలు, చర్యలు కొత్త ప్రభుత్వంలో ఏ విధంగా తీసుకున్నారు? వాటి ఫలితాలు ఏ విధంగా ఉన్నాయి? 2014 నాటితో పోల్చితే ఈ రోజున తెలంగాణ వ్యవసాయరంగం, రైతులూ, రైతుకూలీల ఆర్థిక స్థితిగతులు, గ్రామీణ ఆర్థికవ్యవస్థపై ఆధారపడి జీవించే వృత్తుల వారి జీవితాలు ఎట్లా మెరుగుపడ్డాయో మన కండ్ల ఎదుట కనిపిస్తున్న విషయం.

ఇక్కడ మరొక ముఖ్యమైన మాట చెప్పుకోవాలి. ప్రస్తుతం ఉద్యోగాలు, ఉపాధుల గురించి చాలా చర్చ జరుగుతున్నది. ఈ లక్షలాది యువతలో అధికులు గ్రామీణ ప్రాంతాల వారు. వారు చదువుకొని ఉద్యోగ, ఉపాధుల కోసం పట్టణాలకు వెళ్లటం 2014కు ముందు కూడా ఉండేది గాని ఇప్పుడు అనేక రెట్లు పెరిగింది. అంతకుముందు హైస్కూలు, కాలేజీల స్థాయిలో డ్రాపౌట్లు భారీగా ఉండేవి. వ్యవసాయ ఆర్థికవ్యవస్థపై ఆధారపడిన వారు తమ పిల్లలను చదివించలేకపోవటం అందుకు కారణం. ఆ డ్రాపౌట్ల నుంచే అనేకమంది యువకులు నక్సలైట్ ఉద్యమంలో చేరే వారు. తర్వాత తెలంగాణ ఉద్యమానికి వారే ఒక ముఖ్యాధారమయ్యారు. కానీ, 2014 తర్వాత పరిస్థితి గణనీయంగా మారింది. చదువు పూర్తిచేసే వారు పెరిగారు. సొంత రాష్ట్రం ఏర్పాటు వారిలో ఉద్యోగ, ఉపాధి అవకాశాల పట్ల ఆశలను పెంచింది. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు రెండింటినీ కలిపి చూస్తే అటువంటి అవకాశాలు రాష్ట్రంలో, దేశ విదేశాల్లో వారికి 2014 కన్న ముందుతో పోల్చితే పెద్ద సంఖ్యలో పెరుగుతున్నాయి కూడా. అయినప్పటికీ, పెరుగుతున్న గ్రాడ్యుయేట్ల వెల్లువకు అది సరిపడేవిధంగా లేదన్నది నిజం. అందుకు కారణాలు, పరిష్కారాలు ఏమిటన్నది అట్లుంచి చర్చను ప్రస్తుత విషయానికి పరిమితం చేస్తే, గ్రామసీమలు 2014 నుంచి ఎంతో మెరుగుపడినందువల్లనే ఈ స్థితి చోటుచేసుకుంటున్నదనేది గుర్తించవలసిన విషయం. అంతేకాదు, గ్రామాల నుంచి హైదరాబాద్ వంటి చోట్లకు తరలివెళ్లి పనిపాటలు, చిన్నపాటి వృత్తులు చేసుకొని జీవిస్తున్న లక్షలాదిమంది దిగువ మధ్య తరగతివారి ఆర్థికశక్తి కూడా 2014 తర్వాత తమ పిల్లలను వీలైనంత పైస్థాయికి చదివించగల విధంగా ఎదుగుతున్నది. రాష్ట్రం అభివృద్ధి సాధించినందువల్ల ఏర్పడే సవాలు. దానిని ఎట్లా పరిష్కారించాలన్నది ప్రశ్న.

ఇదంతా జరుగుతున్నది 2014ను రాష్ట్రాభివృద్ధికి ఒక కీలకమైన మలుపుగా మార్చుకున్న ముందుచూపు వల్లనే. తిరిగి మరొక ముఖ్య విషయం చెప్పుకోవాలంటే, తెలంగాణ ఏర్పడినా కొత్త నాయకత్వాలు విఫలమై, యువకుల్లో తీవ్ర అశాంతి తలెత్తగలదని, బలహీనపడుతున్న నక్సలైట్ ఉద్యమానికి కొత్త రిక్రూట్‌మెంట్లు రాగలవని నక్సలైట్ నాయకత్వం అంచనాలు వేసింది. కానీ, అదేమీ జరగలేదు. కొత్త రాష్ట్రం, బలపడుతున్న ఆర్థికవ్యవస్థలు, యువతకు కొత్త చదువులు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, అప్పటికే నక్సలైట్ ఉద్యమం పట్ల తగ్గిన ఆకర్షణలు కొత్త పరిస్థితులను సృష్టించాయి. దానితో నక్సల్ ఉద్యమం ఇంకా బలహీనపడింది. ఇదే స్థితి మునుముందు సైతం కొనసాగగలదనేందుకు సందేహం అక్కరలేదు. మొత్తం మీద గుర్తించవలసింది ఏమంటే, 2014 నుంచి గ్రామీణ తెలంగాణ యావత్తు సాగునీటికి, విద్యుత్తుకు కొరత లేక ఆర్థికంగా, సామాజికంగా క్రమంగా ఎంతో పరివర్తన చెందుతున్నది. చివరికి పచ్చదనం పరిశుభ్రత, మంచినీటి సరఫరా, విద్య, ఆరోగ్యం, రవాణా సదుపాయాలు, ఆహార లభ్యత, పోషక విలువల పెరుగుదల, అన్ని తరగతుల వారి సగటు ఆదాయాల మెరుగుదల వంటి అనేక అంశాల్లో ఇతర రాష్ర్టాలు అన్నింటికి మించి జాతీయస్థాయి అవార్డులు గెలుచుకోగల మేరకు తెలంగాణ అనే కొత్త రాష్ట్రం ఎదిగింది. ఆ విధంగా వెన్నెముక బలపడుతున్నది.

వచ్చే 48 గంటలలో ప్రజలంతా ప్రశాంతంగా, జాగ్రత్తగా ఆలోచించవలసిన విషయాలు ఇవన్నీ. ఇవన్నీ జరుగుతున్నాయి గనుకనే తెలంగాణ రాష్ట్రం సాకారమై అయిదేండ్లు గడిచేసరికే పేదలు, పేద రైతుల వలసలు ఆగి, గ్రామీణ కూలీలకు పనులు దొరుకకపోవటమనే దుస్థితి పూర్తిగా తొలగిపోయి, గ్రామాల్లో, పట్టణాల్లో కూడా పనులకు ఇక్కడివారు చాలక అనేక ఇతర రాష్ర్టాల నుంచి కూలీలు, ఇతర పనుల వారు మన రాష్ర్టానికి వలస వస్తున్న మార్పు కండ్లెదుట కనిపిస్తున్నది. పేదరికం, కునారిల్లే వ్యవసాయం, నక్సలైట్ ఉద్యమం, రకరకాల అశాంతులతో మగ్గిపోతుండిన గడ్డలో ఇటువంటి మార్పులను ఎన్నడైనా ఊహించామా? తెలంగాణ రూపురేఖలు సమూలంగా పరివర్తన చెందుతున్న ఈ అభివృద్ధి క్రమం రాగల కాలంలో ఏ విధంగా, ఎవరి ఆధ్వర్యాన అయితే కొనసాగగలదన్నదే 30న పోలింగ్ సమయంలోగా ప్రజలు ప్రశాంతంగా, జాగ్రత్తగా ఆలోచించవలసిన విషయం.

మరొక కీలకమైన రంగం పట్టణాలు, పరిశ్రమలు, వ్యాపారాలు మౌలిక సదుపాయాలు, రవాణా, కమ్యూనికేషన్లు, విద్యా-వైద్యాలు, పౌర సదుపాయాలు, మత కలహాలు లేని ప్రశాంతత వంటివి. ఈ అంశాల్లో 2014 నాటి తెలంగాణకు నేటి తెలంగాణకు పోలికే లేదని స్థానికులు, ఇతర రాష్ర్టాల నుంచి, విదేశాల నుంచి వచ్చినవారంతా ముక్తకంఠంతో అంటున్నందున ఇంక చెప్పేదేమీ లేదు. ఒక ప్రాంతం వ్యవసాయికంగా ఎంత వర్ధిల్లుతున్నా పట్టణ ప్రాంతాలు, నగరాలు కూడా అందుకు దీటుగా అభివృద్ధి చెందకపోతే అది సమగ్రమైన అభివృద్ధి కాబోదు. ఆ రాజ్యం ముందుకు పోజాలదన్నది మనకు ప్రపంచ చరిత్ర చెప్తున్న వాస్తవం. హైదరాబాద్ నగరం 2014కు ముందు కూడా తగినంత అభివృద్ధి చెందిన మాట నిజమే అయినా, ఆ తర్వాత నుంచి కళ్లు మిరుమిట్లు గొలిపేట్లు వెలుగుతున్నదని ప్రజలు గుర్తిస్తున్నదే గనుక, ఈ రెండు రోజుల్లో వారు చేయవలసింది, ఇది ఎట్లా సాధ్యమైంది? ఎట్లా కొనసాగాలి? ఆ పనిచేసిన వారెవరు? మునుముందు చేయగల వారెవరు? అనే ప్రశ్నల గురించి శాంతంగా, జాగ్రత్తగా ఆలోచించటం. ఈ రోజున వివిధ జిల్లా కేంద్రాలు వేగంగా సకల సదుపాయాలతో అభివృద్ధి దిశలో సాగుతుండటమే గాక, రాష్ట్ర రాజధాని అయితే ధగాధగాయమానంగా వెలుగుతున్నదని ప్రజలకు తెలుసు. మాది తెలంగాణ అని, మాది హైదరాబాద్ అని వారిప్పటికే అంతటా సగర్వంగా చెప్పుకొంటున్నారు.

అటు గ్రామీణ తెలంగాణకు, ఇటు పట్టణ తెలంగాణకు కూడా వర్తించే అంశం ప్రజా సంక్షేమం. వివిధ బలహీనవర్గాలకు సంక్షేమ చర్యలు అవసరమన్న గుర్తింపు, వాటి అమలు ప్రపంచంలో, మన దేశంలో వందల ఏండ్లుగా ఉన్నాయని తెలిసిందే. అందుకు అనుగుణంగా తెలంగాణలో పూర్తి నిబద్ధతతో అమలవుతున్న సంక్షేమ చర్యలు అనతికాలంలో కేంద్రాన్ని, అన్ని రాష్ర్టాలను మించిపోవటమన్నది ఈ సందర్భంలో ప్రత్యేకంగా గుర్తించవలసిన విశేషం. 1947 నుంచి ఇంతవరకు మొత్తం దేశంలోనే ఇంతటి సంక్షేమపు ఆలోచనలు ఎప్పుడూ, ఎక్కడా లేవు. తెలంగాణలోని వివిధ వర్గాల ప్రజలు, ముఖ్యంగా బడుగు వర్గాలు, మహిళలు, మైనారిటీలు ఇందువల్ల లబ్ధి పొందుతున్నారు. మొత్తం మీద రాష్ట్రం బాగుపడటంలో ఇది కూడా ఒక భాగమన్నది ప్రజలందరూ రాగల 48 గంటలలో ఆలోచించవలసిన అంశాల్లో ఒకటి.

చివరగా, మనకు అర్థం కాకుండా ఉన్న విషయం ఒక్కటి ప్రస్తావించాలి. అది, తరచుగా ప్రభుత్వాన్ని విమర్శించే కొందరు మేధావులు, యాక్టివిస్టుల గురించి. ప్రభుత్వ విధానాలు, వాటి అమల్లోని లోటుపాట్లను ఎత్తిచూపటం, తమ సూచనలు చేయటం వీరు చేయవలసిన పనే. ఏ వ్యవస్థలోనైనా అది వారి పాత్ర కూడా. కానీ, సమస్య ఎక్కడ వస్తున్నదంటే వారు తెలంగాణ ప్రభుత్వపు డజన్ల కొద్దీ విధానాలు, వాటి అమలు తీరు, అందువల్ల కలిగే ఫలితాల మంచి చెడులు, అందుకు భిన్నంగా చేయవలసిందేమిటి అనే వివరణలతో ఒక సమగ్రమైన నిర్మాణాత్మక పత్రాన్ని ఈ పదేండ్లు పూర్తవుతున్న దశలోనూ సిద్ధం చేసి ప్రజల ముందుంచలేదు. అది వారి తీవ్ర వైఫల్యం కాగా అంతకన్న విచారకరమైన పని ఒకటి చేస్తున్నారు. ఏ కాంగ్రెస్ అయితే 75 ఏండ్లుగా దేశానికి ఇన్నిన్ని కష్టాలు తెచ్చిపెట్టిందో, నక్సలిజం సహా అనేక ఉద్యమాలకు కారణమై వేలకు వేలమందిని కాల్చిచంపి లక్షల మందిని జైళ్ల పాలు చేసిందో, తమ వైఫల్యాలతో శూన్యాన్ని సృష్టించి బీజేపీ ఆగమనానికి బాటలు వేసిందో, తెలంగాణ కష్టాలన్నింటికి 1956 నుంచి కారణమై మోసాలు చేసి ఉద్యమాలను అణగదొక్కిందో, తెలంగాణ కోసం ఇప్పటికీ ఒక దార్శనికత లేదో, కేవలం అధికారం కోసం విన్యాసాలన్నీ చేస్తున్నదో, అటువంటి పార్టీ పల్లకిని బహిరంగంగా మోస్తూ ఊరేగుతుండటం ఆశ్చర్యకరమే. అందుకు వారు వివరణ ఇవ్వాలి.

# మనకూ, కర్ణాటక కరెంటుకు పొంతనా?



**శశికళ ఠాకూర్**

**పారిశ్రామిక, వ్యవసాయ, సేవారంగాన్నే కాకుండా సామాజిక, ఆర్థిక, రాజకీయ, మానవ జీవన ప్రవాహాన్ని కూడా కరెంటు ప్రభావితం చేస్తున్నది. రాజ్యాంగం ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి అంశంగా ఉన్న విద్యుత్తు దేశ ప్రజల ప్రగతిని నిర్దేశిస్తున్నదనడంలో సందేహం లేదు. ఎక్కడాలేని విధంగా ప్రస్తుతం దేశం మొత్తమ్మీద అన్నివర్గాల విద్యుత్తు వినియోగదారులకు తెలంగాణ ప్రభుత్వం 24 గంటల నిరంతరాయ, నాణ్యమైన విద్యుత్తును అందిస్తున్నదనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. 2030-31 సంవత్సరానికి దక్షిణ భారతదేశంలోనే అత్యధిక విద్యుత్తు వినియోగం గావించే రాష్ట్రంగా తెలంగాణ అవతరించనున్నదని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ ఇటీవల పేర్కొనడం అభినందనీయం.**

ఈ ప్రస్థానం ఆషామాషీగా జరగడం లేదు. దీనివెనుక ముఖ్యమంత్రి కేసీఆర్ దార్శనికత, విద్యుత్తురంగంలో పనిచేస్తున్న వేలాది ఇంజినీర్ల, కార్మికుల కృషి ఉన్నది. తెలంగాణకు పూర్వం కరెంటు పరిస్థితి ఎట్లుండె, ప్రస్తుతం ఎట్లున్నది, ఎలా సాధ్యపడిందన్న విషయాలను చర్చించుకుందాం. విజయాల సమీక్ష పునరావృతమైనప్పటికీ 2014కు ముందు ఎట్లుండె? విద్యుత్తు వినియోగదారులను గృహ, వాణిజ్య పారిశ్రామిక, వ్యవసాయ ప్రజావసరాల వర్గాలుగా విభజించుకుంటాం.

**గృహం:** గ్రామాలకు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకు 12 గంటలు కోతలు.. వేసవికాలం రాత్రిపూట కోతలు అదనం.. మండల కేంద్రాలు 8-12 గంటలు.. జిల్లా కేంద్రాలు 4 నుంచి 8 గంటలు.. విశ్వనగరం హైదరాబాద్‌కు 4 గంటల కోతలు. కరెంటు ఇచ్చే విషయంలో కూడా అమానవీయ విభజన. మనసు ఎంత గుంజినా వేసవి సెలవుల్లో పిల్లాపాపలతో స్వగ్రామాలకు వెళ్లడానికి ఇష్టపడేవారు కాదు.

**వాణిజ్యం:** ఏ నగరంలో చూసినా వాణిజ్య సముదాయాల ముందు జనరేటర్ల రణగొణధ్వని... బజార్లో వెళ్తుంటే డీజిల్ వాసన ముక్కుల్లోకి పోకుండా ముక్కుకు 'దస్తీ' అడ్డం పెట్టుకునేవారు. అపార్ట్‌మెంట్లకు జనరేటర్ బ్యాకప్ ఉందా లేదా చూసుకునేవారు. జిరాక్స్, ఫొటోగ్రఫీ, ఐస్‌క్రీం, జ్యూస్ సెంటర్లు, హోటళ్లకు విద్యుత్తు కోతలతో అపారనష్టం సంభవించేది. క్రికెట్ మ్యాచ్‌ల వంటివి ఉంటే ఇన్వర్టర్లు ఉన్న ఇండ్లు వెతుక్కునేవాళ్లం.

**పారిశ్రామికం:** రాష్ట్రంలోని పరిశ్రమలకు, ఐటీ హబ్‌లకు వారానికి రెండురోజులు పవర్ హాలీడే. నెలకు 10-12 రోజులు పారిశ్రామిక వాడల్లో చిమ్మచీకట్లు. దీనికి అదనంగా ప్రతీ రోజు సాయంత్రం పీక్ అవర్స్ అంటే 6-10 గంటల వరకు మూడు ఫేజులు కరెంటు వాడరాదు. లైటింగ్ మాత్రమే వాడుకోవాలనే నిబంధన. దీన్ని అతిక్రమించిన వారికి భారీ పెనాల్టీలు. విద్యుత్తు సిబ్బంది అనధికారికంగా ఏమైనా పరిశ్రమలకు కరెంటు ఇస్తున్నారా? అని తనిఖీలు చేయడానికి విజిలెన్స్ డిపార్ట్‌మెంట్‌వాళ్లు తిరిగేవారు.

**వ్యవసాయరంగం:** కరెంటు విషయంలో అత్యంత ఉపేక్షకు, నిరాదరణకు గురైన రంగం. రైతులను వినియోగదారులుగా చూసేవారు కాదు. ఎక్కడచూసినా వంగిన స్తంభాలు వేలాడుతున్న తీగలు, పేలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్లు, కాలిపోయే మోటర్లు వెరసి ఎండిన పంటలు పవర్ హాలీడేల లాగ 'క్రాప్ హాలిడే' ప్రకటించిన దుర్దినాలు. వ్యవసాయ సీజన్‌కు ముందు వ్యవసాయ శాఖ, కరెంటు డిపార్టుమెంట్ వాళ్లు ఊరూరు తిరిగి వరి పంటలు వేయకూడదని ఆరుతడి పంటలు వేసుకోవాలని నీటి పారుదలకు సరిపోను కరెంటును సరఫరా చేసే పరిస్థితిలో ప్రభుత్వం లేదని విన్నపాలు బెదిరింపులు. పగలు మూడు గంటలు, రాత్రి మూడు గంటల కరెంటుతో తరచుగా మోటర్లు కాలిపోవడం లేకుంటే ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోవడం, కాలిన ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చేసరికి పానిపట్టు యుద్ధం గెలిచినంత ఆనందం.

**3 హెచ్‌పీ మంజూరు ఉంది, 5 హెచ్‌పీ మోటర్ వాడుకుంటున్నందుకు డెవలప్‌మెంట్ చార్జీలు కట్టమని వేధింపులు, కరెంటు కత్తిరింపులు బిల్లులు కట్టడం లేదని స్టార్టర్లు, సర్వీసు వైర్లు పీక్కపోవడం. లేకుంటే ఎక్కడికక్కడ ట్రాన్స్‌ఫార్మర్లు బందు పెట్టడం. అన్నం పెట్టే రైతన్నకు అవమానాలు, అవహేళనలు. ఇతర రంగాల విషయానికి వస్తే గ్రామాల్లో నీటి సరఫరా, బోరు మోటర్లు కాలిపోవడం.. కరెంటు సరిపోక నీటికి కటకట. తరచుగా మోటర్లు కాలిపోయి సర్పంచులు అప్పుచేసి మరీ మోటర్లు రీవైండింగ్ చేయించడం... మోటర్ టెస్టింగ్ చేయడానికి పది నిమిషాల మూడు ఫేజులు కరెంటు ఇవ్వడానికి కూడా భయపడిపోయే అధికారులు. పైనుంచి వేధింపుల స్థాయి అలాంటిది మరి.**

నేటి పరిస్థితులు అందరూ అనుభవిస్తున్నారు. భారతదేశంలోని మరే రాష్ట్రంలోనూ లేనంతటి మంచి కరెంటు. కోతలు లేవు. ఓల్టేజీ సమస్య అసలుకే లేదు. ప్రమాదాలు లేవు. ప్రజలు పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు, రైతులు ఇలా సమస్త ప్రజానీకం కరెంటు సమస్య నుంచి శాశ్వతంగా బయటకు వచ్చింది. మన రాష్ట్రంలోనే ఎందుకు సాధ్యపడింది. వేరే రాష్ర్టాలు ఎందుకు విఫలమవుతున్నాయి. ఉత్తరాది, దక్షిణాది, పశ్చిమాది ఏ రాష్ట్రంలో చూసినా కరెంటు కష్టాలు ఎందుకున్నాయి. ఢిల్లీ, బెంగళూరు, చెన్నైలాంటి కాస్మోపాలిటన్ నగరాలు కూడా కరెంటు కోతలతో తల్లడిల్లిపోతున్నాయెందుకు?



2014 జూన్ 2న రాష్ట్రం బాగుపడాలంటే విద్యుత్తురంగాన్ని గాడినపెట్టాలని కేసీఆర్ తిరుగులేని నిర్ణయం తీసుకున్నారు. స్వల్ప, మధ్యకాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలను రూపొందించారు. అన్నిరంగాల వారికి 24 గంటల కరెంటును అందించడంతో పాటు వ్యవసాయరంగానికి 9 గంటల పగటిపూట కరెంటునివ్వాలనుకున్న కేసీఆర్ అనూహ్యంగా 24 గంటల సంచలన నిర్ణయం తీసుకున్నారు. వ్యవసాయరంగానికి 24 గంటల కరెంటునిస్తే అధికారపక్షంలో చేరిపోతానని ప్రతిపక్ష నాయకులు అనేంత అనితర సాధ్యమైన నిర్ణయమది. 2018, జనవరి 1 నుంచి యావత్తు దేశం ఆశ్చర్యపడేలా రైతులకు 24 గంటల కరెంటు ఉచితంగా అందించడం ప్రారంభమైంది.

ఉచితాలకు వ్యతిరేకమని చెప్పుకొనే కేంద్ర ప్రభుత్వం వ్యవసాయరంగానికే కాకుండా మిగతా ప్రజానీకానికి కూడా సబ్సిడీలు ఇవ్వరాదనే ఉద్దేశంతో, డిస్ట్రిబ్యూషన్ రంగంలో ప్రైవేట్ పెట్టుబడిదారులకు చోటు కల్పించి ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యపరచడానికి విద్యుత్తు సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టారు. దేశవ్యాప్తంగా రైతు సంఘాలు, విద్యుత్తు సంస్థల ఉద్యోగులు, తెలంగాణ పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళ, తదితర రాష్ర్టాల ముఖ్యమంత్రుల అభ్యంతరాలు, పార్లమెంటు సభ్యుల ఒత్తిడి మేరకు బిల్లును స్టాండింగ్ కమిటీకి నివేదించారు. బిల్లుకు వ్యతిరేకంగా తెలంగాణ ముఖ్యమంత్రి అసెంబ్లీలో తీర్మానం కూడా చేశారు.

ప్రజా వ్యతిరేకత దృష్ట్యా బిల్లు పెండింగులో ఉన్నప్పటికీ మార్గదర్శకాలు, సర్క్యులర్ల రూపంలో కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ వ్యవసాయరంగానికి కూడా మీటర్లు పెట్టమని నిర్దేశిస్తున్నది. ఆదేశాలు పాటించని రాష్ర్టాలకు కేంద్ర ప్రభుత్వం ఎఫ్ఆర్‌బీఎం పరిమితిని పెంచకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నది. ఆ రకంగా తెలంగాణ సుమారు రూ.25 వేల కోట్ల నిధులు కోల్పోయింది.

తెలంగాణ రాష్ట్రం జనరేషన్, ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ రంగాలకు వేలాది కోట్ల రూపాయల నిధులు కేటాయించి - స్వయం సమృద్ధిని సాధించింది. రాష్ట్రం ఏర్పడినప్పుడు 7,778 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం ఉండగా నేడది 19,464 మెగావాట్లకు చేరుకున్నది. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ 4 వేల మెగావాట్లు, ఎన్టీపీసీ రామగుండంలో 1600 మెగావాట్లు, తొందర్లో అందుబాటులోకి రానున్నాయి. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులన్నీ పూర్తయితే 27,949 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి వ్యవస్థ అందుబాటులోకి వస్తుంది. విద్యుత్తు రంగం బలోపేతానికే కాకుండా ప్రతీ సంవత్సరం గృహ, వ్యవసాయ, కులవృత్తులు పౌల్ట్రీ తదితర రంగాలకు కేటాయిస్తున్న సబ్సిడీలు, రాయితీలు సుమారు 98 వేల కోట్ల రూపాయలకు పైమాటే. నిరంతరం విద్యుత్తురంగం రాబోయే డిమాండ్‌ను అంచనాలు వేసుకుంటూ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నెట్‌వర్క్‌ను, సబ్ స్టేషన్లు, లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను జోడించుకుంటూ వెళ్లడమే కాకుండా కేంద్రం నుంచి అవసరమైన సహాయ సహకారాలు లేకపోయినా, కారణాలేమైనా కలిగిస్తున్న అవాంతరాలను దాటుకొని దృఢంగా నిలబడి తెలంగాణ ప్రజల కరెంటు కష్టాలు తీర్చడం కేవలం కేసీఆర్‌కే సాధ్యం.

**2001లో టీఆర్‌ఎస్ (ఇప్పుడు బీఆర్‌ఎస్) స్థాపించినప్పటి నుంచి తెలంగాణ పట్ల అంకితభావం నుంచి కేసీఆర్ ఎప్పుడూ పక్కకు తప్పుకోలేదు. ఆమరణ నిరాహార దీక్ష, సబ్బండ వర్గాలను ఏకం చేయడం, శాంతియుతంగా, గాంధేయమార్గంలో చేసిన ఉద్యమం, రాజకీయ అనివార్యత ద్వారా కేసీఆర్ తెలంగాణ సాధించారు. రాష్ట్ర అవతరణ తర్వాత తెలంగాణపై ఎన్ని కుట్రలు జరిగినా వాటిని తిప్పికొట్టి ఒక స్థిరమైన నాయకత్వంతో తెలంగాణను సంక్షేమం, అభివృద్ధిపథంలో నడిపారు. 'తెలంగాణ ఆచరిస్తున్నది- దేశం అనుసరిస్తున్నది' అనే స్థాయికి తెలంగాణను తీసుకొచ్చారు.**

# ఎవరి నైతికత ఎంత?



**పెండ్యాల మంగళాదేవి**

కాంగ్రెస్ విషయానికి వస్తే.. 1948 నుంచి ఇప్పటివరకు తమ పార్టీ ప్రయోజనాలకు ఇచ్చినంత ప్రాధాన్యం, తెలంగాణ ప్రాంత ప్రయోజనాలకు ఇవ్వనేలేదు. ఏకంగా ఓటుకు నోటు కేసులో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ నిందితుడినే తమ పార్టీ అధ్యక్షునిగా చేసుకోవడం తెలంగాణ పట్ల వారికి ఉన్న అనైతిక విధానాన్ని తెలియజేస్తున్నది. బీజేపీ విషయానికి వస్తే.. కాకినాడ తీర్మానంపై వెనక్కిమళ్లడం నుంచి, రాజ్యసభలో వ్యతిరేకించిన విధానం నుంచి, తల్లిని చంపి బిడ్డను బతికించారనేంత వరకు తెలంగాణ పట్ల ఉన్న చులకన భావం, వారి అనైతికను తెలియజేస్తున్నది.

58 ఏండ్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్, టీడీపీ-బీజేపీ కూటమి కలిసి కాలరాసిన హక్కులను కేసీఆర్ ప్రభుత్వం తిరిగి ఈ పదేండ్లలో సాధించింది. నీళ్లు, నిధులు, నియామకాలపై తెలంగాణ కోల్పోయిన హక్కులను తిరిగి సాధించారు. తెలంగాణ నీళ్ల వాటాను తరలించి తెలంగాణకు నష్టం కలిగించడంలో కాంగ్రెస్ ముందుంటే, తీసిపోని విధంగా తెలంగాణ నీటి వాటాను టీడీపీ దోపిడీ చేస్తే, బీజేపీ సహకరించింది. ప్రాజెక్టుల ద్వారా, మిషన్ కాకతీయ ద్వారా తెలంగాణ నీటి హక్కులను తిరిగి కేసీఆర్ సాధించారు. ఈ క్రమంలో కాంగ్రెస్, ఇతర పార్టీలు, వ్యక్తులు వివిధ రకాల కేసుల ద్వారా ఈ ప్రక్రియను ఆపే ప్రయత్నం చేసినప్పటికీ కేసీఆర్ ప్రభుత్వం ఆ కుట్రలను సమర్థవంతంగా తిప్పికొట్టింది. తెలంగాణ కోటి ఎకరాల మాగాణం అని తల ఎగరేసి ప్రతీ తెలంగాణ పౌరుడు చెప్పుకొనేట్టు చేసిన వ్యక్తి ముఖ్యమంత్రి కేసీఆర్.

**గత యాభై ఎనిమిదేండ్లుగా కాంగ్రెస్, టీడీపీ నాయకులు నిధుల వాటాను సీమాంధ్ర ప్రాంతానికి తరలించి తెలంగాణ ప్రజలకు తీరని అన్యాయం చేశారు. కానీ, కేసీఆర్ ఇక్కడి నిధులను ఇక్కడే ఖర్చుచేయడం వల్ల రైతు బంధు, కల్యాణలక్ష్మి, ఆసరా పింఛన్, రైతు బీమా, దళితబంధు, బీసీ బంధు, వెయ్యి గురుకులాలు, నీటి ప్రాజెక్టులు, మంచినీటి సదుపాయం, మంచి రోడ్లు, నిరంతర విద్యుత్తు, జిల్లాకో మెడికల్ కాలేజీ వంటి ఎన్నో కార్యక్రమాలు ముఖ్యమంత్రి కేసీఆర్ అమలుచేసి చూపించారు.**

గడిచిన 23 ఏండ్ల చరిత్రను పరిశీలిస్తే.. తెలంగాణ పట్ల కేసీఆర్‌కు ఉన్న నిబద్ధత ఏ ఒక్క వ్యక్తిలో కానీ, ఏ పార్టీలో కానీ కనిపించదు. పదేండ్లు కూడా నిండని తెలంగాణకు పరిరక్షకునిగా కేసీఆర్‌ను కాక మరెవరినీ ఊహించలేమని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. 2024, జూన్ 2 వరకు ఉన్న జాయింట్ క్యాపిటల్, సెక్షన్ 8 వంటి నిబంధనలు పూర్తిగా తొలగి, కృష్ణా నది నీటిహక్కులు, వివిధ సంస్థల ఆస్తుల పంపకాలు పూర్తయ్యేవరకు ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉండటమే తెలంగాణ హక్కులకు రక్ష.